# పీజేఆర్ ఆశయం.. బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- పీజేఆర్ కుటుంబాన్ని వంచించిన కాంగ్రెస్
- 36 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి
- అనేక శాఖలకు మంత్రిగా, సీఎల్పీ నాయకుడిగా సేవలందించిన పీజేఆర్
- అతడి వారసుడిగా విష్ణువర్ధన్ రెడ్డి 16 ఏండ్లు సేవలు
- ఐదు దశాబ్దాల సేవకు అవమానం మిగిల్చిన కాంగ్రెస్
- జూబ్లీహిల్స్ టికెట్ ఇస్తామని.. చివరికి హ్యాండిచ్చిన హస్తం పార్టీ
- అక్కున చేర్చుకున్న సీఎం కేసీఆర్.. బీఆర్ఎస్‌లో చేరిన విష్ణు
- సముచిత స్థానం ఇచ్చి గౌరవించుకుంటామన్న సీఎం
- బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని పీజేఆర్ వారసుడి శపథం




తెలంగాణ భవన్‌లోకి వస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మాగంటి, దాసోజు శ్రవణ్ తదితరులు

సిటీబ్యూరో/బంజారాహిల్స్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ) : పీజేఆర్..ఇది పేరు కాదు. పేదోడి ప్రాణం. ఈ మూడు అక్షరాలు పలుకుతుంటే ప్రతి బస్తీవాసి కండ్లల్లో ఇప్పటికీ ఓ ఆత్మీయ అనుబంధం వికసిస్తుంది. వ్యక్తి దూరమై 16 ఏండ్లైనా.. ఇప్పటికీ ఆ పేరు ప్రజల్లో కదలాడుతూనే ఉంటుంది. తనకు పేదోడి సంతోషమే హై కమాండ్ అని సగర్వంగా చెప్పి అనేక ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తి పీజేఆర్. కార్మిక నాయకుడిగా ప్రారంభమైన అతడి రాజకీయ జీవితం.. మంత్రిగా ఉన్నా కూడా ప్రజలతో ఆయన అదే బంధాన్ని కొనసాగించాడు.

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..

సుమారు 36 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశారు. 2007లో గుండెపోటుతో మరణించాక.. అతడి కుమారుడు విష్ణు వర్ధన్‌రెడ్డి పీజేఆర్ వారసుడిగా 16 ఏండ్లు కాంగ్రెస్ కోసం పనిచేశారు. నాన్న 36 ఏండ్లు.. కొడుకు 16 ఏండ్లు.. కాంగ్రెస్ కోసం పనిచేసినా హస్తం పార్టీ ఆ కుటుంబాన్ని మోసం చేసింది. జూబ్లీహిల్స్ టికెట్ విష్ణుకే అని చెప్పి.. ప్రచారం చేసుకోవాలని సూచించి.. చివరికి వేరొకరికి టికెట్ కేటాయించి పీజేఆర్ వారసుడిని కాంగ్రెస్ పార్టీ వంచించింది. ఇప్పుడు అదే జూబ్లీహిల్స్ ఇలాకాలో కాంగ్రెస్ పార్టీని ఓడించి పీజేఆర్ వారసత్వాన్ని కాపాడుకుంటామని, బీఆర్ఎస్‌ను గెలిపిస్తామని ఓటర్లు నినదిస్తున్నారు. 'మా పీజేఆర్ వారసుడిని అక్కున చేర్చుకున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం' అంటూ కృతజ్ఞతలు చెబుతున్నారు.

### అన్యాయాలపై ఎగిసిపడ్డ గొంతుక

కార్మిక నేతగా గుర్తింపు పొందిన పీజేఆర్ 1978లో తొలిసారిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గం ఉండేది. ప్రస్తుతం ఉన్న ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్‌లోని కొంతభాగం మొత్తం గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోనే ఉండేవి. అంతపెద్ద నియోజకవర్గానికి ఐదుసార్లు ఎమ్మెల్యే సేవలు అందించిన పీజేఆర్ అంటే నగరంలో తెలియనివారు ఉండరు. సహకార యువజన సర్వీసుల శాఖ, కార్మిక ఉపాధి, గృహ నిర్మాణ శాఖ, పౌరసరఫరాల శాఖల మంత్రిగా పనిచేశారు. సీఎల్పీ లీడర్‌గా వ్యవహరించారు. అంతేకాదు నగరంలో వెలిసిన అనేక బస్తీలు పీజేఆర్ హయాంలో ఏర్పడ్డవే. ప్రభుత్వ స్థలాల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే వారికి రక్షణగా నిలబడి బస్తీలు ఏర్పాటు చేయించడమే కాకుండా వారికి అవసరమైన తాగునీరు, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించే పీజేఆర్ పేరును నేటికి అనేక బస్తీల్లో పేదలు గుర్తించుకుంటారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను గొంతెత్తి ప్రశ్నించే పీజేఆర్‌కు తెలంగాణ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. హైదరాబాద్‌లో మంచినీటి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పుడు అనేక ఆందోళనలకు నాయకత్వం వహించడంతోపాటు హైదరాబాద్ నగరానికి కృష్ణా జలాలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. అంతటి ఘనమైన చరిత్ర కలిగిన పీజేఆర్ సుమారు 36 ఏండ్లపాటు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశారు.

### వారసుడిగా విష్ణు ఎంట్రీ..!

2007లో పీజేఆర్ గుండెపోటుతో మృతి చెందడంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి విజయం సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాగా, 2014, 2018లలో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలైన విష్ణువర్ధన్‌రెడ్డి మరోసారి రానున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించారు. పార్టీ పెద్దల సూచనలతో గత కొంత కాలంగా నియోజకవర్గంలో ప్రచారం కూడా చేసుకుంటున్నాడు. అయితే తనను ధిక్కరించారన్న కోపంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చివరి నిమిషంలో నియోజకవర్గంతో ఏమాత్రం సంబంధంలేని మాజీ భారత క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు టికెట్ ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన విష్ణువర్ధన్ రెడ్డి షాక్‌కు గురయ్యారు. తన తండ్రి పీజేఆర్ సుమారు 36 ఏండ్లపాటు కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశారని, తాను గత 16 ఏండ్లుగా పార్టీ కోసం పనిచేస్తుండగా.. రేవంత్‌రెడ్డి తనను మోసం చేశారంటూ విష్ణువర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణ బిడ్డగా హక్కుల కోసం పోరాడిన పీజేఆర్ తనకు ఎంతో సన్నిహితుడని, ఆయన కుటుంబానికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ విష్ణువర్ధన్‌రెడ్డిని అక్కున చేర్చుకున్నారు. బీఆర్ఎస్ పార్టీలో విష్ణువర్ధన్‌రెడ్డికి సరైన గుర్తింపు ఇస్తామని, కుటుంబసభ్యుడిగా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో తెలంగాణ బిడ్డలకు ముఖ్యమంత్రి ఇచ్చే గౌరవాన్ని ప్రజలంతా సంతోషంగా స్వాగతిస్తున్నారు.

### తెలంగాణ భవన్‌లో సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే మాగంటి

మంగళవారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలోకి చేరేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి ప్రస్తుత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తోపాటు బీఆర్ఎస్ సీనియర్ నేత డా.దాసోజు శ్రవణ్, నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు సీఎన్.రెడ్డి, దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్ తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ చేతులమీదుగా గులాబీ కండువా కప్పుకున్న విష్ణువర్ధన్‌రెడ్డికి కరచాలనం చేసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సాదరంగా పార్టీలోకి స్వాగతం పలకడం పార్టీ శ్రేణులకు ఆనందాన్ని కలిగించింది.

# ఎల్బీ నగర్‌లో బీఆర్ఎస్ జయభేరి ఖాయం

- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- కురుమల ఆత్మీయ సమ్మేళనం, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కలిసిన సుధీర్‌రెడ్డి



నాగోలులో కురుమల ఆత్మీయ సమ్మేళనంలో గొర్రె పిల్లతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు, తదితరులు

ఎల్బీనగర్, అక్టోబర్ 31 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జయభేరి మోగించడం ఖాయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగోలులో కురుమల ఆత్మీయ సమ్మేళనం, మన్సూరాబాద్ డివిజన్‌లో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రచార కార్యక్రమాలతోపాటుగా డివిజన్ల వారీగా పలు ప్రచార కార్యక్రమాల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. పదకొండు డివిజన్లలోనూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం, అభివృద్ధి కోసం పథకాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నారన్నారు. రైతన్నలను రాజుగా చేసేందుకు రైతుబంధు పథకంతోపాటుగా రైతుబీమా పథకం, ఉచిత విద్యుత్, సాగునీరును అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. కురుమల ఆత్మీయ భవనానికి కోకాపేట్‌లో స్థలం, నిధులు ఇవ్వడం జరిగిందని, కురుమల కోసం గొర్రెల పంపకంతో ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో చెరువుల సుందరీకరణతోపాటుగా వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటుగా యోగా కోసం నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం కురుమ, బొగ్గారపు దయానంద్ గుప్తతోపాటుగా కురుమ సంఘం నాయకులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న అలీంఖాన్, ఇక్బాల్ తదితరులు

దుండిగల్, అక్టోబర్ 31 : సీఎం కేసీఆర్ తన మేధాశక్తిని ఉపయోగించి 70 ఏండ్లల్లో జరుగని అభివృద్ధిని తొమ్మిది ఏండ్లల్లో చేసి చూపించారని ప్రభుత్వ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి శంభీపూర్‌రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. మంగళవారం గాజులరామారం(పరిధి) డివిజన్ పరిధిలోని ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కృష్ణమూర్తి, రాములుగౌడ్, బీఎంఎస్‌ట్రేడ్ యూనియన్ నాయకులు చందర్‌యాదవ్‌తోపాటు సూరారం డివిజన్(129) పరిధి షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజాఆశీర్వాద సభలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఆలీంఖాన్, సలహాదారు ఇక్బాల్‌తో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు బీఆర్ఎస్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డి.విజయరాంరెడ్డి పాల్గొన్నారు. షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధానకార్యదర్శి సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి మద్దతిస్తే ప్రశాంతత దెబ్బ తింటుంది

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్, అక్టోబర్ 31 : పేద ప్రజలకు మేలుచేస్తున్న బీఆర్ఎస్ పార్టీని కాదని మతతత్వాన్ని ప్రోత్సహించే బీజేపీలాంటి పార్టీలకు మద్దతు పలికితే హైదరాబాద్ నగరంలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్, చింతల్‌బస్తీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎన్నికల ఇన్‌చార్జి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తాతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్తీలో పాదయాత్ర నిర్వహించిన ఎమ్మెల్యే దానం రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలకాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసుకోగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరుణ్‌కుమార్, రావుల విజయ్‌కుమార్, మెట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూనగర్‌లో బీఎల్ఆర్ ముమ్మర ప్రచారం



నెహ్రూనగర్‌లో అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్, అక్టోబర్ 31 : ఉప్పల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ బ్లాక్-1,2,3 లలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ అవగాహన కల్పించారు. కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్పొరేటర్ పన్నాల బస్తీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.